# బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 29 సెప్టెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## దక్షిణాఫ్రికాలో దారుణం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

దక్షిణాఫ్రికా లోని గ్రామీణ పట్టణ ప్రాంతంలో ఇరుగుపొరుగు వారి మధ్య తలెత్తిన ఘర్షణలో సామూహిక కాల్పుల ఫలితంగా 17 మంది ప్రాణాలు కోల్పోయారు. చికిత్స పొందుతున్న మరో బాధితుని పరిస్థితి విషమంగా ఉంది. దక్షిణాఫ్రికా లోని ఆగ్నేయా ప్రాంతం తూర్పుకేప్ ప్రావిన్స్‌లో లూసికిసికీ పట్టణంలో శుక్రవారం రాత్రి ఈ నరమేథ బీభత్సం జరిగింది. పోలీస్‌లు విడుదల చేసిన వీడియో దృశ్యాల బట్టి ఇరుగుపొరుగున ఉన్న రెండు ఇళ్ల మధ్యనే ఈ కాల్పులు జరిగినట్టు స్పష్టమవుతోంది. ఒక ఇంటిలో 12 మంది మహిళలు, ఒక వ్యక్తి హత్యకు గురికాగా, మరో ఇంటిలో ముగ్గురు మహిళలు, మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయారని పోలీస్‌లు చెప్పారు. ఈ దారుణ మరణాల వెనుక ఉన్న దోషుల కోసం వేటాడుతున్నామని పోలీస్ అధికార ప్రతినిధి బ్రిగ్, అథ్లెండా మేథీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచం మొత్తం మీద నరహత్యలు ఎక్కువగా జరిగే దేశాల్లో దక్షిణాఫ్రికా ఒకటి. ఇటీవల సామూహిక కాల్పుల సంఘటనలు అధికంగా జరగడం సర్వసాధారణమైంది. కొన్ని సార్లు ఇళ్లల్లోని వారిని టార్గెట్ చేసుకుని హత్యలు కావిస్తున్నారు. గత ఏప్రిల్‌లో క్వాజులునాటల్ ప్రావిన్స్‌లో ఇరుగుపొరుగు మధ్య సామూహిక కాల్పులు జరిగి ఒకే కుటుంబానికి చెందిన పది మంది ప్రాణాలు కోల్పోయారు.

# కుటుంబ డిజిటల్ కార్డులో.. మహిళే యజమాని



- ఒకే కార్డులో రేషన్, ఆరోగ్య, ఇతర పథకాల వివరాలు
- ప్రస్తుత అందుబాటులోని డాటా ఆధారంగా కుటుంబాల నిర్ధరణ
- అక్టోబరు 3 నుంచి పైలెట్‌గా క్షేత్ర స్థాయి పరిశీలన
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కుటుంబ డిజిటల్ కార్డులో మహిళనే ఇంటి యజమానిగా గుర్తించాలని, ఇతర కుటుంబ సభ్యుల పేర్లు, వారి వివరాలు కార్డు వెనుక ఉంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులకు (ఎఫ్‌డీసీ) సంబంధించి రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై ఈ నెల 25వ తేదీ నుంచి 27 వ తేదీ వరకు రాజస్థాన్, హర్యానా, కర్ణాటక, మహారాష్ట్రల్లో పర్యటించిన అధికారులు చేసిన అధ్యయనంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కార్డుల రూపకల్పలో ఆయా రాష్ట్రాలు సేకరించిన వివరాలు, కార్డులతో కలిగే ప్రయోజనాలు, లోపాలను అధికారులు వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యామిలీ డిజిటల్ కార్డుల రూపకల్పనపై అధికారులకు పలు ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న రేషన్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఐటీ, వ్యవసాయ, ఇతర సంక్షేమ పథకాల్లోని డాటా ఆధారంగా కుటుంబాల నిర్ధారణ చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల కార్డుల రూపకల్పన, జారీలో ఉన్న మేలైన అంశాలను స్వీకరించాలని, లోపాలను పరిహరించాలన్నారు. బ్యాంకు ఖాతాలు, పాన్ కార్డుల వంటి అనవసర సమాచారం సేకరించాల్సిన పని లేదన్నారు.

**ప్రతి శాసనసభ నియోజకవర్గం పరిధిలో పైలెట్‌గా రెండు ప్రాంతాల్లో...**

ఫ్యామిలీ డిజిటల్ కార్డులకు సమచార సేకరణ, వాటిల్లో ఏం ఏం పొందుపర్చాలి, అప్‌డేట్‌కు సంబంధించిన వివరాలను నివేదిక రూపంలో ఆదివారం సాయంత్రంలోగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనరసింహలతో కూడిన మంత్రివర్గ ఉప సంఘానికి అందజేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రివర్గ ఉప సంఘం సూచనల మేరకు అందులో జత చేయాల్సిన, తొలగించాల్సిన అంశాలను సమగ్ర జాబితా రూపొందించాలని సూచించారు. అనంతరం రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో రెండు ప్రాంతాలు ఒక గ్రామీణ, ఒక పట్టణ ప్రాంతాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయాలని సీఎం సూచించారు. (పూర్తిగా గ్రామీణ ప్రాంతాలున్న నియోజకవర్గాల్లో రెండు గ్రామాలు, పూర్తిగా పట్టణ/నగర ప్రాంతాలు ఉన్న నియోజకవర్గాల్లో రెండు వార్డులు/ డివిజన్లను ఎంపిక చేస్తారు.) కుటుంబాల నిర్ధరణ, ఫ్యామిలీ డిజిటల్ కార్డుల వివరాలకు సంబంధించి అందుబాటులో ఉన్న డాటా ఆధారంగా అక్టోబరు మూడో తేదీ నుంచి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి (డోర్ టూ డోర్) పరిశీలన చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. పైలెట్ ప్రాజెక్టును పకడ్బందీగా చేపట్టాలని, ఇందుకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నియోజకవర్గానికి ఆర్డీవో స్థాయి అధికారిని, పట్టణ/నగర ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ స్థాయి అధికారిని పర్యవేక్షణకు నియమించాలని, ప్రతి ఉమ్మడి జిల్లాకు ఇటీవల వరదల సమయంలో వేసిన సీనియర్ అధికారులను పర్యవేక్షకులుగా నియమించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. క్షేత్ర స్థాయి పరిశీలన సమగ్రంగా కచ్చితత్వంతో చేపట్టాలని, ఎటువంటి లోపాలకు తావులేకుండా చూడాలని ముఖ్యమంత్రి హెచ్చరించారు. సమీక్షలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శులు అజిత్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శులు సంగీత సత్యానారాయణ, మాణిక్ రాజ్, షానవాజ్ ఖాసీం, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




### సామాజిక మార్పులకు సారథులుగా
## నూతన స్నాతకులు ఉండాలి

- అట్టడుగు వర్గాలకు న్యాయం అందేలా న్యాయవాదులు కృషి చేయాలి
- నల్సార్ న్యాయ వర్సిటీ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

సామాజిక మార్పులకు సారథులుగా నూతన స్నాతకులు ఉండాలని, న్యాయవాదులు సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలకు న్యాయం అందించేందుకు కృషి చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఎసంపన్నులకు లభించే న్యాయం.. నిరుపేదలకు నేటికీ అందకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ తరం న్యాయనిపుణులు మార్గదర్శకులుగా నిలిచి ఈ విధానంలో మార్పు తీసుకురావాలని అన్నారు. శనివారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పరిధిలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో జరిగిన 21వ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పీహెచ్‌డీ, ఎల్‌ఎల్‌ఎంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు.

అనంతరం రాష్ట్రపతి మాట్లాడుతూ.. బంగారు పతకాల విజేతలలో విద్యార్థినీలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనేక పరిమితులు ఉన్నప్పటికీ కుమార్తెలు తమ ఉన్నత ప్రదర్శనతో మనల్ని గర్వపడేలా చేస్తున్నారని చెప్పారు. నల్సార్ విశ్వవిద్యాలయం మహిళా న్యాయవాదులు, న్యాయ విద్యార్థులతో కూడిన దేశవ్యాప్త నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకోవాలని సలహా ఇచ్చారు. ఈ నెట్‌వర్క్ మహిళలపై అఘాయిత్యాలను అరికట్టడానికి అలాంటి అఘాయిత్యాల కేసులను ఎదుర్కోవడానికి సంఘటిత ప్రయత్నాలు చేయడానికి ఎంతో పని చేయగలదన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తంచేశారు. నేడు ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని, న్యాయవ్యవస్థలో కూడా సాంకేతికతను ఉపయోగించుకుని బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. దేశంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంతోపాటు కేసుల సత్వర పరిష్కారం కోసం జాతీయ స్థాయిలో నెట్‌వర్క్ ఉండాలని అభిప్రాయపడ్డారు. పూర్వ విద్యార్థులతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న మహిళా న్యాయవాదులు, న్యాయ విద్యార్థులతోనూ నెట్‌వర్క్ ఏర్పాటు చేయాలన్నారు. నల్సార్‌లో జంతు న్యాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమని, జంతు సంరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి అవసరమని పేర్కొన్నారు.

నల్సార్‌లో ఏఐను ఒక అధ్యయనంగా గుర్తించడం సంతోషకరమని మిగితా 3వ పేజీలో

### బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోని
## ఇండ్లను ఎప్పటికైనా తొలగించాల్సిందే

**మూసీకి వరదలు వేస్తే ఇబ్బందులు పడేది ప్రజలే**



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

మూసీ నది ప్రక్షాళనలో భాగంగా బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఇండ్లను ఎప్పటికైనా తొలగించాల్సిందేనని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ దాన కిశోర్ స్పష్టం చేశారు. ప్రజల కోసమే మూసీ ప్రక్షాళన చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఇతర అధికారులతో కలిసి మూసీ రివర్ ఫ్రంట్ ఎండీ దానకిశోర్ మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ పరివాహక ప్రాంతం నుంచి ఎవరినీ బలవంతంగా పంపించడం లేదని అన్నారు. వారికి నచ్చజెప్పి తరలిస్తున్నట్లు వెల్లడించారు. మూసీకి వరద వస్తే ఇబ్బంది పడేది ప్రజలేనని దాన కిశోర్ అన్నారు. 1927లో వరదల కారణంగా భారీ నష్టం జరిగిందని గుర్తు చేశారు. అయితే.. మూసీ నిర్వాసితులకు రూ.30 లక్షల విలువైన ఇండ్లు ఇస్తున్నామని అన్నారు. అలాగే.. హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని దానకిశోర్ చెప్పారు. మూసీకి వచ్చే మురికిని క్లీన్ చేసేందుకు రూ.3,800 కోట్లు కేటాయించామని, మూసీ నిర్వాసితులకు ఉపాధితో పాటు డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టిస్తామని దాన కిశోర్ హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి అధికారులు వెళుతున్నారని, ప్రతీ విషయం వివరిస్తున్నారని చెప్పారు. చట్టానికి లోబడే హైడ్రా అధికారులు పనిచేస్తున్నారు అని దాన కిశోర్ చెప్పారు. ఆక్రమణలకు గురైన మూసీని విస్తరింపజేస్తామని అన్నారు. 55 కిలోమీటర్ల పొడవైన ఈస్ట్, వెస్ట్ కారిడార్లు నిర్మిస్తామని దానకిషోర్ పేర్కొన్నారు. ఈస్ట్, వెస్ట్ కారిడార్ల నిర్మాణంతో ట్రాఫిక్ తగ్గుతుందని, మూసీ వెంట పార్కింగ్ సదుపాయాలు, పార్కులు నిర్మిస్తామని తెలిపారు. మొన్నటి వర్షాలకు హైదరాబాద్ మునిగిపోయిందని, మూసీ ప్రక్షాళన అనేది సుందరీకరణ కోసం చేస్తున్న పనులు కాదనే విషయం అర్థం చేసుకోవాలని దానకిశోర్ కోరారు.

గతంలో మూసీ సుందరీకరణకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య పలు సూచనలు చేశారన్నారు. "ఇటీవల భారీ వర్షాలు కురిసి హైదరాబాద్ మునిగిపోయింది. మొన్న దాదాపు 9 సెం.మీ. పైగా వర్షాలు హైదరాబాద్‌లో కురిశాయి. చిన్న వర్షానికే సచివాలయం ముందు వరద పోటెత్తింది. భారీ వర్షపాతం నమోదైతే అధికారులు కూడా ఏం చేయలేరు. ప్రజల కోసమే మూసీ అభివృద్ధి చేస్తున్నాం. మూసీ నది సుందరీకరణ కోసం ఈ చర్యలు తీసుకోవడం లేదు. మూసీ వరదల వల్ల బాధపడేది ప్రజలే. ఈ సిటీని ఇంకా ముందుకు తీసుకెళ్లాలని సీఎం నిర్ణయించారు. చారిత్రాత్మక ప్రదేశాలను అద్భుతంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది" అని దాన కిశోర్ తెలిపారు.

"హైదరాబాద్‌లో ప్రస్తుతం కోటి జనాభా ఉంది. మూసీ పరివాహ ప్రాంతం మురికి కూపంలా మారింది. మూసీకి వరదలు వేస్తే ఇబ్బందులు పడేది ప్రజలే. మూసీ పరిధిలోని ఎమ్మెల్యేలను తీసుకొని క్షేత్ర పర్యటనకు వెళ్తాం. 2030 కల్లా హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థ 250 బిలియన్ డాలర్లకు చేరుతుంది. మూసీలోకి వచ్చే నీటిని శుద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. మూసీకి వచ్చే నీటిని శుద్ధి చేసేందుకు రూ. 3800 కోట్ల వ్యయం చేస్తున్నాం. 2026 జూన్ లోపు మూసీలో మంచినీళ్లు ప్రవహించాలని సీఎం ఆదేశించారు. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఇళ్లను ఎకప్పటికైనా తొలగించాల్సిందే. మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయిస్తాం. మూసీ నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకుంటాం అని దాన కిశోర్ పేర్కొన్నారు. మిగితా 3వ పేజీలో

- మూసీ నిర్వాసితులకు రూ.30 లక్షల విలువైన ఇండ్లు
- మూసీ పరివాహక ప్రాంతం నుంచి ఎవరినీ బలవంతంగా పంపించడం లేదు
- మూసీకి వచ్చే మురికిని క్లీన్ చేసేందుకు రూ.3,800 కోట్లు కేటాయింపు
- 2026 జూన్ లోపు మూసీలో మంచినీళ్లు ప్రవహించాలని సీఎం ఆదేశించారు
- మూసీ పరిధిలోని ఎమ్మెల్యేలను తీసుకొని క్షేత్ర పర్యటనకు వెళ్తాం
- మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

## మూసీపై అఖిలపక్షాన్ని పిలవాలి

- బుచ్చమ్మది ప్రభుత్వ హత్య
- మాజీ మంత్రి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు
- తెలంగాణ భవన్‌లో హైడ్రా బాధితులతో హరీశ్‌రావు భేటీ




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

మూసీపై అఖిలపక్షం సమావేశం తర్వాత ముందుకెళ్లాలనిమాజీ మంత్రి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ లీగల్ బృందం బాధితులకు అండగా ఉంటుందని హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. తెలంగాణ భవన్‌కు వచ్చిన మూసీ ప్రాంత బాధితులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రతినిధులు పాల్గొన్నారు. బాధితులు బీఆర్ఎస్ నేతలు, న్యాయవాదుల ముందు తమ గోడు చెప్పుకుంటూ కన్నీటి పర్యంతమయ్యా యి. ఈ సందర్భంగా వారి ఆవేదన విన్న హరీశ్‌రా వు కన్నీరు పెట్టుకున్నారు. అనంతరం బాధితులను ఉద్దేశిస్తూ హరీశ్‌రావు మాట్లాడుతూ, కేసీఆర్ పాలనలో ప్రజలను ఇబ్బందిపెట్టలేదని గుర్తు చేశారు. వంద రోజు ల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్న అంశంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజలు రోగాల బారిన పడుతున్నప్పుడు వాటిపై దృష్టి పెట్టే ఆలోచన సిఎంకు లేదని విమర్శించారు. పేదల ఇళ్లు కూల్చి మూసీపై పెద్ద భవనాలకు అనుమతి ఇస్తామంటున్నారంటూ ప్రశ్నించారు. అందుకే బాధితులకు రక్షణ కవచంలా గా బీఆర్ఎస్ ఉంటుందని హామీ ఇచ్చారు.

కూకట్‌పల్లికి చెందిన బుచ్చమ్మ ది ఆత్మహత్య కాదని రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన హత్య అని హరీశ్ రావు ఆరోపించారు. హైడ్రా పేరిట ఇప్పటికే మూడు ఆత్మహత్యలు జరిగాయని ధ్వజమెత్తారు.

**గాంధీ ఆస్పత్రి వద్ద స్వల్ప ఉద్రిక్తత**

హైడ్రా వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న బుచ్చమ్మ మృతదేహాన్ని చూసేందుకు మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రా రెడ్డి, కూకట్‌పల్లి ఎంఎల్ఎ మాధవరం కృష్ణారావులు గాంధీ మార్చురీకి వె ళ్లారు. అక్కడ మార్చురీలోకి వెళ్లేందుకు పోలీసులు అనుమతించకపోవడంతో పోలీసులతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. అనంతరం బుచ్చమ్మ పార్థివ దేహాన్ని చూసి, మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఎవరికోసం ఈ మూసీ సుందరీకరణ..?..ఎవరికి మేలు చేసేందుకు ఈ కూల్చి వేతలు..? అని ప్రశ్నించారు. మూసీలో నీళ్లు పారించాల నుకుంటున్నావా..? రక్తం పారించాలను కుంటున్నారా..? అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. వెంటనే హైదరాబాద్ ఎమ్మెల్యేలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నాయి.. వాటిని షరిష్కరించు అని హరీశ్‌రావు సూచించారు.

గాంధీ హాస్పిటల్‌లో చిన్న చిన్న మందులకు రోగులు ఇబ్బంది పడుతున్నారని మిగితా 3వ పేజీలో

## బీజేపీ నేతలపై కేసులు

- ఏ1గా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల బాండ్ల పేరిట పలువురు పారిశ్రామికవేత్తలను బెదిరించారన్న ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, బీజేపీ జాతీయ నాయకులపై బెంగళూరులో కేసులు నమోదయ్యాయి. జనాధికార సంఘర్ష సమితి సహాధ్యాక్షుడు ఆదర్శ్ అయ్యర్ ఫిర్యాదు మేరకు కోర్టు ఆదేశాలతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పారిశ్రామిక వేత్తలను ఎన్నికల బాండ్ల పేరిట బెదిరించి పలువురు బీజేపీ నేతలు వారి పార్టీకి 8వేల కోట్లకుపైగా నిధులు సమకూర్చుకున్నట్లు జనాధికార సంఘర్ష సమితి సహాధ్యక్షుడు ఆదర్శ్ అయ్యర్ ఆరోపించారు. ఈ అంశంపై గతంలో తిలక్ నగర ఠాణాలో ఆయన ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. అయితే పోలీసులు ఆయన ఫిర్యాదును స్వీకరించలేదు. పోలీసుల తిరస్కరణ నేపథ్యంలో ప్రజాప్రతినిధుల కేసుల కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం ఆదర్శ్ అయ్యర్ అభియోగం మోపిన వారిపై కేసు నమోదు చేయాలని తిలక్‌నగర్ ఠాణా పోలీసులను తాజాగా ఆదేశించింది. అధికారాన్ని దుర్వినియోగం చేసి విరాళాల పేరుతో కార్పొరేట్ సంస్థలను బెదిరించి దోచుకున్నారని ఫిర్యాదుదారు ఆదర్శ్ అయ్యర్ ఆరోపించారు. అందుకే కోర్టుకు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

## మరో శ్రీలంక కాబోతున్న తెలంగాణ

- కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



తెలంగాణ మరో శ్రీలంక కాబోతుందని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా డౌన్ అవుతుందన్నారు. బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్ పార్టీకి పట్టడం ఖాయమన్నారు. గ్రామ పంచాయతీ నిధులే అంశంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎన్నికలకు సిద్ధమా? అని సవాల్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ మంచి విజయం సాధిస్తుందన్నారు.

బండ్లగూడ జాగీర్‌లో విద్యారణ్య భవన ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైడ్రా కూల్చుతున్న ఇళ్లన్నీ హిందువులవేనని సేంచలన ఆరోపణలు చేశారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ కొరివితో తలగోక్కుంటుందని విమర్శించారు. హైడ్రాకు బీజేపీ వ్యతిరేకం కాదని, కానీ ఈ కారణంగా పేదలు రోడ్డున పడవద్దని సూచించారు.

ఇక తిరుమల డిక్లరేషన్‌పై మాట్లాడుతున్న ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు మక్కా, వాటికన్ నిబంధనలపై మాట్లాడే దమ్ముందా? అని ప్రశ్నించారు. ఎవరి మత సాంప్రదాయానికి సంబంధించి వారికి ప్రత్యేక నిబంధనలు ఉంటాయన్నారు. హిందువులపై, తిరుమల డిక్లరేషన్‌పై మాట్లాడిన జగన్ మరింత అపవాదును మూటగట్టుకున్నారని విమర్శించారు. జగన్ డిక్లరేషన్ ఇస్తే తప్పేమిటని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో దళితులకు ఆలయ ప్రవేశం కల్పించలేదని, అదే ఇప్పుడు జగన్ ఫాలో అవుతున్నారని విమర్శించారు.

# యువత ప్రత్యేక నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



- ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**బలగం టీవీ ,రుద్రంగి:**

ప్రభుత్వ ఉద్యోగాలతోపాటుగా ప్రైవేటు కంపెనీల్లో యువతకు కొలువులు ఇప్పించేందుకు జాబ్ మేళాలు చేపడుతున్నదని,యువత వివిధ అంశాల్లో ప్రత్యేక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని, యువత ఉద్యోగాలు ఎక్కడ వచ్చినా వెళ్లాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు . రాజన్న సిరిసిల్ల డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ ఆద్వర్యంలో రుద్రంగి మండల కేంద్రంలో రెడ్డీస్ ఫంక్షన్ హాల్ మెగా జాబ్ మేళా శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాబ్ మేళాకు జిల్లాతో పాటు హైదరాబాద్ వివిధ జిల్లాలకు చెందిన 12 ప్రైవేటు కంపెనీలు రాగా, 375 మంది యువత రాగా,ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆయా సంస్థల స్టాల్స్ ను ప్రభుత్వ విప్ సందర్శించారు. ఆయా సంస్థల్లో ఎందరికి ఉపాధి అవకాశాలు కల్పిస్తారు,ఉద్యోగం చేసేది ఎక్కడ చేసే పని ఏమిటి,వేతనాలు ఎంత ఇస్తారు వసతి సౌకర్యం కల్పిస్తారా తదితర అంశాలపై ఆరా తీశారు.

అనంతరం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడాతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే దాదాపు ఈ తొమ్మిది నెలల్లో 40 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని,ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఇప్పటికే జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని అన్నారు.



గతంలో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, జిల్లా అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలో మెగా జాబ్ మేళా నిర్వహించామని,పట్టణ కేంద్రాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా యువత యువకులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నమని అన్నారు.యువతకు ఉద్యోగావ కాశాలు కల్పించే అంశంపై పక్కా ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని అన్నారు . హైదరాబాద్లో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నదని,ప్రభుత్వ ఉద్యోగాలతోపాటుగా ప్రైవేటు కంపెనీల్లో యువతకు కొలువులు ఇప్పించేందుకు జాబ్ మేళాలు చేపడుతున్నదనిఅన్నారు . వేములవాడ నియోజకవర్గ పరిధిలో ప్రతినెల ఆఖరి శనివారం జాబ్ మేళాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని అన్నారు

ప్రజా ప్రభుత్వం లో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ ముందుకు పోతున్నామని రుద్రంగిలో పుట్టి పెరిగిన వాడిగా మండల కేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని అన్నారు . మొన్నటి రోజున రుద్రంగిలో స్మశాన వాటిక నిర్మాణ స్థలాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారని, అలాగే గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు . ఈ జాబ్ మేళాలో 50 మందికి నియామక పత్రాలను, ఆయా కంపెనీలు 100 మందిని ఎంపిక చేశాయి.వారిలో తుది పరీక్షల అనంతరం ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తారని అన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్, ఆయా కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రముఖ రచయిత్రి విజయ భారతి కన్నుమూత

**బలగం టీవీ ,హైదరాబాద్**

పౌర హక్కుల నేత బొజ్జా తారకం సతీమణి, ప్రముఖ రచయిత్రి బి విజయభారతి (83) శనివారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. కొంతకాలంగా వయో భారంతో పలు అనారోగ్య సమస్యలతో ఆమె బాధపడుతున్నారు. కుంధన్‌బాగ్‌లోని తన కుమారుడు, ఐఏఎస్ అధికారి రాహుల్ బొజ్జా నివాసంలో తుది శ్వాస విడిచారు. విజయభారతికి ఒక అమ్మాయి కూడా ఉన్నారు. అభిమానుల సందర్శనార్థం విజయభారతి భౌతికకాయాన్ని ఆదివారం మధ్యాహ్నం వరకు ఇంటి వద్దే ఉంచనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

విజయ భారతి తూర్పు గోదావరి జిల్లా రాజోలులో 1941లో జన్మించారు. ఈమె తండ్రి ప్రముఖ రచయిత బోయి భీమన్న. తల్లి నాగరత్నమ్మ. విజయభారతి కోఠీలోని ఉస్మానియా విశ్వవిద్యాలయం మహిళా కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయం–సాంఘిక పరిస్థితులు అనే అంశపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగులో డాక్టరేట్ పొందిన మొట్టమొదటి దళిత మహిళ విజయభారతే! తెలుగు అకాడమీలో వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రాచీన సాహిత్యకోశం, ఆధునిక సాహిత్యకోశం విజయభారతి సంపాదకత్వంలోనే అకాడమి ముద్రించింది. 1968లో విజయభారతికి ప్రముఖ హేతువావి, పౌరహక్కుల నేత బొజ్జా తారకంతో వివాహం జరిగింది. కుల వ్యవస్థ స్వరూప స్వభావాల గురించి పురాణాలు, ఇతిహాసాలు ఆధారంగా విశ్లేషణలు చేస్తూ, ఆమె చేసిన పలు రచనలను హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురించింది. మహాత్మ జ్యోతిబా పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌లపై కూడా ఆమె పలు రచనలు చేశారు. ఆమె రాసిన షట్చక్రవర్తులు అనే పుస్తక సంకలాని 2003లో కెనడాలోని డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ మిషనరీస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అవార్డులు వచ్చాయి. విజయ భారతి మృతి పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సంతాపం ప్రకటించారు.

## ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించాలి



- స్వచ్ఛతతో ఆరోగ్యం.. ఆహ్లాదం..
- పభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**బలగం టీవీ ,రుద్రంగి:**

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటిస్తే, సీజనల్‌గా వచ్చే రోగాలు దూరం అవుతాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అగాఖాన్ ఫౌండేషన్‌తో కలిసి రుద్రంగి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన "స్వచ్ఛత హీ సేవా" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ తీసి, స్వచ్ఛత హీ సేవపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా లిఏక్ పేడ్ మాకీ నామ్‌లి నాటడం కార్యక్రమంలో భాగంగా ఆ స్కూల్ ఆవరణలో ప్రభుత్వ విప్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

విద్యార్థులకు స్వచ్ఛత ఈ సేవకు సంబంధించిన పెయింటింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సఫాయిమిత్ర సురక్ష క్యాంపు నిర్వహించారు. సఫాయి కార్మికులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పలువురు పారిశుధ్య కార్మికులను సన్మానించి, అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ స్వచ్ఛత పనులతో అందరికీ ఆరోగ్యం ఆనందం సిద్ధిస్తుందని మొక్కలు నాటి సంరక్షిస్తే ఆరోగ్యం.. పచ్చని చెట్లు ఆహ్లాదాన్ని పంచుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నటరాజ్, ఫౌండేషన్ ప్రతినిధులు సెల్వరాజ్, రమణి, ఎస్ బీ ఎం ఐఈసీ కన్సల్టెంట్ సురేష్, ఎంఐఎస్ కన్సల్టెంట్ బి ప్రేమ్ కుమార్, డీవై ఈఈ ప్రేమ్, వైద్య, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.

**బలగం, వేములవాడ :**

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు . శనివారం వేములవాడ పట్టణంలోని మంజునాథ ఫంక్షన్ హాల్ లో రాజన్న సిరిసిల్ల జిల్లా టి ఎస్ పిఆర్టిఎస్ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ను ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు గజమాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడాతు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్ళ బలోపేతానికి అన్ని చర్యలు తీసుకుంటుందని,గత ప్రభుత్వం ఉపాధ్యాయులను విస్మరించిందని అన్నారు.

తాను జిల్లా పరిషత్ సభ్యులుగా ఉన్ననాటి నుండి టీచర్ల తో అనుబంధం ఉందని,ఆ రోజుల్లో ఏ రిటైర్మెంట్ సమావేశం జరిగిన వాటిలో పాల్గొని టీచర్ల చేసిన సేవలను గుర్తు చేసుకునే వాడినని అన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఉపాధ్యాయ భర్తీకి డీఎస్సీ విడుదల చేస్తే, మళ్లీ ప్రజా ప్రభుత్వంలో ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి ఇటీవల దాదాపు 12 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసి, పరీక్ష నిర్వహించిందని అన్నారు .టీచర్ల ఎంతగానో ఎదురు చూసిన ప్రమోషన్లు సుమారుగా 30 వేల మందికి లభించాయని, ఇటీవల 600 పై చిలుకు ఎంఈఓలను నియమించారని అన్నారు.

రాష్ట్రంలో ప్రతి పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద స్కూళ్ళలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుందని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివి రాష్ట్రపతి, శాస్త్రవేత్తలు, కలెక్టర్లు, ఇంజనీర్లుగా ఎదిగిన వారు ఉన్నారని,తాను ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈ స్థాయికి ఎదిగానని అన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసి వారు ఎంచుకున్న రంగంలో రాణిం చేలా టీచర్లు కృషి చేస్తున్నారని అన్నారు.తాను కూడా నిత్య విద్యార్థి లాగే ప్రజా సేవలో ఉంటున్నానని,ఉపాధ్యాయులు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గన్నమనేని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్, ఆయా మండలాల అధ్యక్షులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు..



## లడ్డూపై 'సిట్' దర్యాప్తు ప్రారంభం





**బలగం టీవీ ,హైదరాబాద్**

తిరుమల శ్రీవారి లడ్డూ వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) శనివరాం దర్యాప్తు ప్రారంభించింది. తిరుమలకు ఏఆర్ డెయిరీ మిల్క్ ఫుడ్స్ సరఫరా చేసిన నెయ్యిలో కల్తీ జరిగిందంటూ తిరుపతి ఈస్టు పోలీస్ స్టేషన్లో టీటీడీ మార్కెటింగ్ జీఎం మురళీకృష్ణ ఇటీవల ఇచ్చిన ఫిర్యాదు కాపీని సిట్ బృందం తీసుకుంది. ఈ ఫిర్యాదులో పేర్కొన్న అంశాల ఆధారంగా మార్కెటింగ్ విభాగం రికార్డులను ఈ బృందం పరిశీలించనుంది. సిట్ సభ్యులు మూడు బృందాలుగా ఏర్పడి.. ఒక బృందం తిరుమలలోనూ, మరో బృందం తిరుపతిలోనూ, ఇంకో బృందం చెన్నరులోనూ దర్యాప్తు చేయనుంది. టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్యచౌదరితో అదివారం సమావేశం కానున్నట్లు సమాచారం. తమిళనాడులోని దిండిగల్‌లో ఉన్న ఎఆర్ డెయిరీ మిల్క్ ఫుడ్స్ సంస్థ నుంచి నెయ్యి అందిందని ఫిర్యాదులో ఉన్నందున చెన్నరుకు ఒక బృందం వెళ్లనుంది. తిరుమల లడ్డూ పోటులోనూ విచారణ జరపనుంది. గత ఐదేళ్లలో వైసిపి హయాంలో జరిగిన నెయ్యి కొనుగోళ్ల రికార్డులను పరిశీలించనుంది. ఏ ప్రభుత్వ హయాంలో ఎన్ని ట్యాంకర్ల నెయ్యి సరఫరా అయ్యింది, ఎంత నాణ్యత ఉంది, ఎన్ని ట్యాంకర్లను ఏయే కారణాలతో తిప్పి పంపారు తదితర అంశాలపై విచారించనుంది. మైసూర్ ల్యాబ్ ఇచ్చిన నెయ్యి నాణ్యత రిపోర్టును పరిశీలించనుంది. ఈ బృందానికి సారథ్యం వహిస్తోన్న సిట్ చీఫ్, గుంటూరు రేంజి ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠిని మీడియా ప్రతినిధులు కలవగా, దర్యాప్తు పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. ఈ బృందంలో విశాఖ రేంజి ఐజి గోపినాథ్‌జెట్టి (టిటిడి మాజీ విజిలెన్స్ అధికారి), కడప ఎస్పి హర్షవర్ధన్‌రాజు, తిరుపతి అదనపు ఎస్పి వెంకట్రావు, డిఎస్పిలు జి.సీతారామారావు, శివనారాయణస్వామి ఉన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు తిరుపతి వచ్చిన సిట్ బృందం తొలుత తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. అనంతరం టిటిడి ఇఒ శ్యామలరావును కలిసింది.

## తుపాకులు వాడుతూ బెదిరింపులు.. ఒకరు అరెస్ట్




**బలగం టీవీ ,హైదరాబాద్**

మూడు రాష్ట్రాల్లో తుపాకులు వాడుతూ అమాయకులను బెదిరిస్తున్న గ్యాంగ్ ను మల్కాజిగిరి ఎస్ ఓ టీ పోలీసులు, నేరేడ్‌మెట్ పోలీసులు సంయుక్తంగా అట్టి కేసును ఛేదించారు. ఇందుకు సంబంధించిన కేసు వివరాలను రాచకొండ పోలీస్ కమిషనర్ సుదీర్ బాబు శనివారం ఎల్‌బీ నగర్ సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్ కాకినాడకు చెందిన సాయిరాం రెడ్డి బీకాం డిస్ కంటిన్యూ చేసి ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చాడు. సూరారంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ.. నాగోల్ అమెజాన్ బ్రాంచ్‌లో నాలుగు నెలలు పని చేశాడు. ఈ క్రమంలోనే ఈజీ మనీ కోసం అలవాటుపడి దొంగతనాలకు పాల్పడ్డాడు. రెండు దొంగతనాల కేసులో జైలుకు వెళ్లిన సాయిరాంకు అక్కడ కొందరు నేరస్థులతో పరిచయాలు ఏర్పడ్డాయి. వారి సహాయంతో గ్యాంగ్ స్టార్ మారి పెద్ద నేరాలకు పాల్పడాలని ప్లాన్ చేశాడు. ముంబై, ఏపీతో పాటు మరి కొన్ని రాష్ట్రాల్లో వెపన్స్‌తో ప్రజలను భయపెట్టి డబ్బు వసూల్ చేయాలని స్కెచ్ వేశాడు.జైల్లో నేరస్తుల పరిచయాల ద్వారా తుపాకులు సైతం కొన్నాడు. ఈ ప్రయత్నాల్లో ఉండగానే పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. ఇంకా ఈ గ్యాంగ్‌లో ఎవరు ఉన్నారనే దానిపై దర్యాప్తు సాగుతోందని.. మిగతవారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని సీపీ తెలిపారు. నగరంలో ఇళ్ళు, హాస్టల్స్‌కు వచ్చే వారి పట్ల యజమానులు అప్రమతంగా ఉండాలని ఈ సందర్భంగా సీపీ సుధీర్ బాబు విజ్ఞప్తి చేశారు.

### సామాజిక మార్పులకు సారథులుగా

# నూతన స్నాతకులు ఉండాలి



(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల్లో న్యాయస్థానాలు, ప్రతీ పది గ్రామాలకు ముగ్గురు న్యాయాధికారులతో ధర్మాసనం అవసరమని చాణక్యుడు ఆనాడే తన అర్థశాస్త్రంలో పొందుపరిచారని గుర్తు చేశారు. కేసు విచారణ ముగిసేవరకు న్యాయమూర్తులు, కక్షిదారులు వ్యక్తిగతంగా కలిసేందుకు అనుమతించవద్దని, అప్పుడే నిష్పక్షపాత న్యాయ ప్రధానానికి అత్యంత ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. నల్సార్‌లో ప్రతిభావంతులైన వారిలో విద్యార్థినులే ఎక్కువ మంది ఉండటం గర్వకారణమన్నారు. ఇక మన దేశంలో న్యాయ సంప్రదాయాలు ఎంతో ఉన్నతమైనవని, న్యాయం కోసం మహాత్మాగాంధీ కూడా పోరాటం చేశారని రాష్ట్రపతి తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నల్సార్‌లో న్యాయ విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదగాలని, విశ్వవిద్యాలయానికి, కుటుంబసభ్యులకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.రాష్ట్ర ప్రభుత్వం తరపున విశ్వవిద్యాలయానికి ఆర్థిక సహకారం అందజేస్తామని ప్రకటించారు. స్నాతకోత్సవంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ చాన్సలర్ జస్టిస్ అలోక్ అరాధే, వైస్ చాన్సలర్ శ్రీకృష్ణదేవరావు, మంత్రి సీతక్క పాల్గొన్నారు.

అంతకుముందు ఉదయం 11గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతి ముర్ముకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి స్వాగతం పలికారు. నల్సార్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం అనంతరం సికాంద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఈశాన్య ప్రాంతా అభివృద్ధి మంత్రిత్వశాఖ, సాంస్కృతిక శాఖ సహకారంతో నిర్వహిస్తున్న కళామహోత్సవ్‌ను రాష్ట్రపతి ప్రారంభించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు బేగంపేటకు చేరుకుని ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లారు.

### బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోని

# ఇండ్లను ఎప్పటికైనా తొలగించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ : హైడ్రా అంటే భరోసా, బాధ్యత.. దీనిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయొద్దని సూచించారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించే బాధ్యత హైడ్రాకు ఉందన్నారు. కొన్ని కట్టడాలను కూల్చితే హైడ్రా బాగా పని చేస్తుందని కితాబిచ్చారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకే సీఎం హైడ్రాను తీసుకొచ్చారు. విపత్తు నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ హైడ్రా బాధ్యత. ఎన్ కన్వెన్షన్‌ను కూల్చేశాం.. దాని పక్కన ఉన్న గుడిసెలను కూల్చలేదు. ప్రజలు నివసిస్తున్న భవనాలను అసలు కూల్చలేదు. ఇటీవల కూకట్‌పల్లి నల్ల చెరువులో ఆక్రమణలను కూల్చేశాం. ముందస్తు సమాచారం ఇచ్చినా కొందరు ఖాళీ చేయలేదు. అక్రమ కట్టడాలను మాత్రమే కూల్చివేశాం అని రంగనాథ్ పేర్కొన్నారు.

అమీన్‌పూర్‌లో ప్రభుత్వం భూములు పెద్ద ఎత్తున అన్యాక్రాంతం అయ్యాయి. అమీన్‌పూర్‌లో గతంలో ఓ హాస్పిటల్‌ను కూల్చినా మళ్లీ నిర్మించారు. అమీన్‌పూర్‌లో హాస్పిటల్‌ను కూల్చేశారని ప్రచారం చేస్తున్నారు. అమీన్‌పూర్‌లో కూల్చిన ఆస్పత్రిలో రోగులెవరూ లేరు.. వీడియో రికార్డు కూడా చేశాం అని పేర్కొన్నారు.

హైడ్రా మీద భయంతో బుచ్చమ్మ అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసి చాలా బాధపడ్డాను. బుచ్చమ్మను కొందరు భయపెట్టారు. హైడ్రా అంటే భరోసా, బాధ్యత.. దీనిని బూచిగా చూపించొద్దు. సరైన సమయం ఇచ్చిన తర్వాతే ఆక్రమణలు కూల్చివేస్తున్నాం. ఇప్పుడు కాకపోతే, ఇంకెప్పుడు చెరువులు, నాళాలను కాపాడుకోలేం అని రంగనాథ్ తెలిపారు.

పరిశుభ్రమైన వాతావరణం అనేది రాజ్యాంగంలో భాగం. పరిశుభ్రమైన వాతావరణం జీవించే హక్కులో భాగం. ప్రభుత్వ ఆస్తులను రక్షించాలని రాజ్యాంగంలో పేర్కొన్నారు. పేదలకు ఇబ్బంది చేయాలనేది హైడ్రా అభిమతం కాదు. అసదుద్దీన్ ఓవైసీ, మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డికి చెందిన కాలేజీలపై ఫిర్యాదులు వచ్చాయి. విద్యా సంవత్సరం నష్టపోతుందనే వాటిపై చర్యలు తీసుకోలేదు. అక్రమ కట్టడాలపై వెనుక పెద్దవాళ్లు ఉన్నారని రంగనాథ్ పేర్కొన్నారు.

# మూసీపై అఖిలపక్షాన్ని పిలవాలి



(మొదటి పేజీ తరువాయి)

ఒక న్యాయమా..? అని ప్రశ్నించారు. పేదలు కోర్టుకి వెళ్లలేరు అనే ధైర్యంతోనే కదా వారి ఇళ్లను కూల్చి వేస్తున్నారని దుయ్యబట్టారు. దయచేసి ఎవరూ ఆత్మహత్య చేసుకోవద్దు.. ధైర్యంగా ఉండండి జీవించి పోరాడాలని హరీశ్‌రావు ప్రజలను కోరారు. మనం పోరాడి సాధించుకోవాలి తప్ప ఎవరూ ప్రాణం తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.



# ఐఫా అవార్డుల వేడుక

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ అవార్డ్స్ (ఐఫా)-2024 వేడుక అబుదాబిలో వైభవంగా జరుగుతున్నది. ఈ కార్యక్రమంలో వివిధ భాషలకు చెందిన అగ్ర తారలు సందడి చేశారు. ఈ వేడుకలో అగ్ర నటుడు చిరంజీవి మరో ప్రతిష్టాత్మకమైన అవార్డును సొంతం చేసుకున్నారు. 'ఔట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్ ఇన్ ఇండియన్ సినిమా' పురస్కారాన్ని గెలుచుకున్నారు. అగ్రనటుడు బాలకృష్ణ గోల్డెన్ లెగసీ అవార్డును అందుకున్నారు. ఉమెన్ ఆఫ్‌ది ఇయర్‌గా సమంత అవార్డును స్వీకరించింది.

'ఐఫా' అవార్డుల విజేతలు..
ఉత్తమ తెలుగు చిత్రం: దసరా
ఉత్తమ నటుడు: నాని
ఉత్తమ దర్శకుడు: అనిల్ రావిపూడి (భగవంత్ కేసరి)

# 'రా మచ్చా మచ్చా' ప్రోమో

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



రామ్ చరణ్ గేమ్‌ఛేంజర్‌కు తమిళ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహిస్తుండగా.. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ సినిమాను 2024 క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్.

అయితే ఈ సినిమా నుంచి మేకర్స్ సెకండ్ సింగిల్ విడుదల చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించిన ప్రోమోను విడుదల చేసింది. ఈ మూవీ నుంచి సెకండ్ సింగిల్ 'రా మచ్చా మచ్చా' అనే పాట ప్రోమోను తాజాగా విడుదల చేసింది. రామ్ చరణ్ మాస్ స్టెప్పులతో ఈ పాట ఫుల్ హుషారుగా సాగింది. అయితే ఈ పాట ఫుల్ సాంగ్‌ను సెప్టెంబర్ 30న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. అనంత్ శ్రీరామ్ రాసిన ఈ పాటకు థమన్ సంగీతం అందించాడు

# దసరాకు 'ఎన్‌బికె 109' అప్‌డేట్..!

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం బాబీ దర్శకత్వంలో హై వోల్టేజ్ యాక్షన్ మూవీ చేస్తున్నాడు. ఇప్పటికే ఎక్కువ శాతం షుటింగ్ పూర్తయిన ఈ సినిమాను 2025 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్టు తెలిసింది. మేకర్స్ నుంచి ఇప్పటి వరకు ఈ టైటిల్ పోస్టర్ లేదా టీజర్ పై ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు. ఈ సినిమా కథ ఎలా ఉంటుందనేది కూడా ఎవరికి తెలియదు. అయితే 'ఎన్‌బికె 109' మూవీ టైటిల్ మోషన్ పోస్టర్ లేదంటే టీజర్‌ని దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకి తీసుకొచ్చే ఆలోచనలో మేకర్స్ ఉన్నారట. ఇక ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైశ్వాల్, ఊర్వశీ రౌతేలా హీరోయిన్స్ గా నటిస్తున్నారు. అలాగే బాలీవుడ్ స్టార్ బాబీ డియోల్ పవర్‌ఫుల్ ప్రతినాయకుడిగా కనిపిస్తున్నాడు.

# టీమిండియా టీ20 జట్టు రెడీ





- నితీశ్‌కుమార్‌రెడ్డికి చోటు
- వరుణ్ చక్రవర్తి, మయాంక్ యాదవ్‌లకు పిలుపు


**బలగం టీవీ, ముంబై**

బంగ్లాదేశ్‌తో అక్టోబర్‌లో జరుగబోయే టీ20 సిరీస్ కోసం టీమిండియా జట్టును బీసీసీఐ ప్రకటించింది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్టర్లు సూర్యకుమార్ యాదవ్ సారథిగా 15మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు. ఐపీఎల్‌లో అద్భుతంగా రాణిస్తున్న మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి , పేస్ సంచలనం మయాంక్ యాదవ్ లు డెబ్యూ క్యాప్ అందుకోనున్నారు. అలాగే తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డికి మరోసారి టీమ్‌ఇండియా పిలుపు అందింది.ఇషాన్ కిషన్ కు మాత్రం మరోసారి నిరాశ తప్పలేదు. అతడి బదులు వికెట్ కీపర్లుగా సంజూ శాంసన్, జితేశ్ శర్మలను తీసుకున్నారు.

కాగా, భారత్ – బంగ్లాదేశ్ మధ్య టీ20 సిరీస్ అక్టోబర్ 06న ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో మూడు టీ20 మ్యాచ్‌లు జరగాల్సి ఉన్నాయి. అందులో గ్వాలియర్, న్యూ ఢిల్లీ, హైదరాబాద్ వేదికలుగా ఈ మ్యాచ్‌లు జరగాల్సి ఉన్నాయి. అన్ని మ్యాచ్‌లు రాత్రి 7 గంటలకు ప్రారంభం అవుతాయి.

భారత్ జట్టు : సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), రింకు సింగ్, హార్దిక్ పాండ్యా, రియాన్ పరాగ్, నితీష్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, జితేష్ శర్మ (వికెట్ కీపర్), అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా, మయాంక్ యాదవ్

# ఐదుగురిని రిటైన్ చేసుకునేందుకు అవకాశం



**బలగం టీవీ, ముంబై**

ఐపీఎల్ మెగా వేలానికి ముందు రిటెన్షన్ విధానంపై బీసీసీఐ క్లారిటీ ఇచ్చింది. తెరదించింది. శనివారం ఐపీఎల్ గవర్నింగ్ మండలి సమావేశం నిర్వహించి ప్రకటన చేసింది. ప్రతి ఫ్రాంచైజీకి ఐదుగురిని అట్టిపెట్టుకునే అవకాశం కల్పించింది. గత సీజన్‌లో నలుగురికే అనుమతిచ్చిన బీసీసీఐ ఫ్రాంచైజీల అభ్యర్థనల దృష్ట్యా ఈసారి పోల్చితో ఈసారి ఐదుగురిని రిటైన్ చేసుకోవచ్చని తెలిపింది.మరో విషయం ఏంటంటే.. ఈ ఐదుగురిలో భారత ఆటగాళ్లు ఎందరు ఉండాలి? విదేశీ క్రికెటర్లు పరిమితి ఎంత? అనేది ఫ్రాంచైజీలకే వదిలేసింది. అయితే రైటు టు మ్యాచ్ విధానాన్ని మాత్రం ఒక్క ఆటగాడికే పరిమితం చేయాలని బీసీసీఐ నిర్ణయం తీసుకుంది.

ఇక మెగా వేలంలో ఆటగాళ్లను కొనేందుకు ప్రతి ఫ్రాంచైజీ పర్స్ వాల్యూని బీసీసీఐ అమాంతం పెంచేసింది. నిరుడు మినీ వేలలో రూ. 100 కోట్లు ఉండగా.. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.120 కోట్లకు పెంచింది. దాంతో, గెలుపు గుర్రాల కోసం వేలంలో ఫ్రాంచైజీలు ఎంత చెల్లించేందుకైనా వెనకాడకపోవచ్చు. అంతేకాదు రీటైన్ చేసుకొనే ఆటగాళ్లకు ఎంత చెల్లించాలి? అనేది కూడా బీసీసీఐ వెల్లడించింది.

మొదటి రిటెన్షన్‌కు రూ.18 కోట్లు.
రెండో రిటెన్షన్ రూ. 14 కోట్లు.
మూడో రిటెన్షన్ రూ. 11 కోట్లు
నాలుగో రిటెన్షన్ రూ. 18 కోట్లు.
ఐదో రిటెన్షన్ రూ. 14 కోట్లు

# ఐపీఎల్ మ్యాచ్ ఫీజు రూ. 7.5 లక్షలు

**బలగం టీవీ, ముంబై**

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఆడే ప్లేయర్లకు బీసీసీఐ బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఇకపై లీగ్ మ్యాచ్ ఫీజులు పెంచు తున్నట్లు బీసీసీఐ వెల్లడించింది. 2025 ఐపీఎల్ నుంచి లీగ్‌లో ఆడే ఒక్కో మ్యాచ్‌కు ప్లేయర్లు రూ. 7.5 లక్షలు ఫీజుగా అందుకోనున్నారు. ఈ మేరకు బీసీసీఐ సెక్రటరీ జై షా ట్వీట్ చేశారు.

'ఐపీఎల్? మ్యాచ్ ఫీజులు పెంచుతున్నామని ప్రకటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. మా క్రికెటర్లు ఇప్పటి నుంచి ఒక్కో మ్యాచ్‌కు రూ.7.5 లక్షల ఫీజు అందుకోనున్నారు. కాంట్రాక్ట్ డబ్బుతో అదనంగా, సీజన్‌లో అన్ని మ్యాచ్‌లు ఆడినట్లైతే ఒక్కో ప్లేయర్‌కు అత్యధికంగా రూ. 1.05 లక్షలు ఫీజు రూపంలో అందుతుంది. ఇందుకోసం అన్ని ఫ్రాంచైజీలు రూ. 12.60 కోట్లు మ్యాచ్ ఫీజుల కోసం సిద్ధంగా ఉంచుకోవాలి. ఐపీఎల్‌కు, ప్లేయర్లకు ఇది కొత్త శకం' అని జై షా ట్వీట్‌లో రాసుకొచ్చారు. కాగా, గతంలో ఒక్కో మ్యాచ్‌కు ఫీజు రూ. 2 – 4 లక్షల మధ్యలో ఉండేది.

# రెండో టెస్టు వాష్ ఔట్



**బలగం టీవీ, కాన్పూర్**

భారత్, బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న రెండో టెస్టు రెండో రోజు ఆట ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. రాత్రి నుంచి కురిసిన ఎడతెరిపిలేని వర్షానికి మైదానం మొత్తం చిత్తడిగా మారిపోయింది. ఉదయం 11.15 నిమిషాలకు కొంత తెరిపినిచ్చినా.. గ్రౌండ్స్‌మెన్ మూడు సూపర్ సాపర్లతో మైదానాన్ని సిద్ధం చేసేందుకు ప్రయత్నించినా వెలుతురు సరిగ్గా లేకపోవడంతో ఆట సాధ్యపడలేదు.తొలిరోజు సైతం వర్షం కారణంగా ఆటను కొన్ని గంటల ముందే ముగించాల్సి వచ్చింది.

ఇక బంగ్లాదేశ్ ప్రస్తుత స్కోరు 107/3. మొమినుల్ హక్(40), ముష్ఫికర్ రహీమ్(6) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో ఆకాశ్‌దీప్ 2, అశ్విన్ 1 వికెట్ పడగొట్టారు. ఇప్పటికే రెండు టెస్టుల సిరీస్‌లో ఒక టెస్టు గెలిచిన భారత్ 1–0 ఆధిక్యంలో కొనసాగుతోంది.



# భారీ గెలుపు దిశగా శ్రీలంక

**బలగం టీవీ, గాలె**

న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక గెలుపు దీశగా వెళ్తోంది. సమిష్టి ప్రదర్శనతో అదరగొడుతున్న లంక.. కివీస్‌కు చుక్కలు చూపిస్తున్నది. ఓవర్‌నైట్ స్కోరు 22/2 శనివారం తొలి ఇన్నింగ్స్‌కు దిగిన కివీస్..లెఫ్టార్మ్ స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య (6/42) ధాటికి 88 పరుగులకే కుప్పకూలింది. లంకపై టెస్టుల్లో కివీస్‌కు ఇదే అత్యల్ప తొలి ఇన్నింగ్స్‌గా రికార్డయ్యింది. సాంట్నర్ (29) టాప్‌స్కోరర్‌గా నిలువగా, మిగతా బ్యాటర్లు స్వల్ప స్కోర్లకు పరిమితమయ్యారు. ఆ తర్వాత ఫాలోఆన్‌కు దిగిన కివీస్ ఆట ముగిసే సరికి 5 వికెట్లకు 199 పరుగులు చేసింది. కాన్వే (61) అర్ధసెంచరీతో ఆకట్టుకోగా, విలియమ్సన్ (46), బ్లండెల్(47 నాటౌట్) రాణించారు. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవడానికి 315 పరుగుల దూరంలో ఉంది.

# రోహన్ బోపన్న జోడికి నిరాశ



**బలగం టీవీ, ముంబై**

భారత సీనియర్ టెన్నిస్ ఆటగాడు రోహన్ బోపన్నకు నిరాశ ఎదురైంది. ఓటముల పరంపర కొనసాగుతోంది. యూఎస్ ఓపెన్‌లో క్వార్టర్స్‌కు ముందే ఇంటిదారి పట్టిన బోపన్న.. తాజాగా చైనా ఓపెన్‌లోనూ నిరాశపరిచాడు. ఏటీపీ 500 టోర్నీ అయిన చైనా ఓపెన్ పురుషుల డబుల్స్‌లో ఇవాన్ డోడిగ్(క్రొయేషియా)తో కలిసి ఆడిన భారత స్టార్‌కు తొలి రౌండ్‌లోనే చుక్కెదురైంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో బోపన్న ద్వయానికి అన్‌సీడెడ్ ఆటగాళు చెక్ పెట్టారు.

చైనా ఓపెన్‌లో ఫేవరెట్‌గా అడుగుపెట్టిన బోపన్న – ఇవాన్ జోడీకి ఫ్రాన్సిస్కో సెరునుడొలో, నికోలస్ జారీలు ఊహించని షాక్ ఇచ్చారు. హెూరాహెూరీగా సాగిన మ్యాచ్‌లో ఫ్రాన్సిస్కో, నికోలస్ ద్వయం బోపన్న జంటకు గట్టి పోటీనిచ్చింది. తొలి సెట్‌ను ఒక్క పాయింట్ తేడాతో గెలుపొంది.. రెండో సెట్‌ను కూడా అంతే తేడాతో సొంతం చేసుకుంది. దాంతో, బోపన్న ద్వయం 5–6, 6–7తో అనూహ్యంగా ఓటమి పాలైంది.